క్లుప్తంగా

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



పాఠశాలలో మాట్లాడుతున్న రాజశేఖర్

నడిగూడెం : విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని విజయీభవ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు చారుగండ్ల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో విజయీభవ ట్రస్టు ఆధ్వర్యంలో 'పరీక్షలను ప్రేమించు-ఉన్నతంగా జీవించు' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా లాఫింగ్ థెరపీ, యోగా, ఆరోగ్య సూత్రాలు, నిద్ర ఆవశ్యకత, ఏకాగ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి వెంకటరమణ, హెడ్‌కానిస్టేబుల్ అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో ఉచిత కంటి వైద్యశిబిరం



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మునగాల : మండలంలోని జగన్నాథపురంలో స్వయం కృషి స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో నార్కెట్‌పల్లి కామినేని వారి సహకారంతో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో 100మందికి కళ్లద్దాలు, 250మందికి ఉచితంగా మందులు అందచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మరో 55మందికి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు సిఫారసు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ వెంపటి భీష్మారావు, స్వయం కృషి వ్యవస్థాపక అధ్యక్షుడు నెమ్మాది సంజీవ, సంస్థ జనరల్ మేనేజర్ గడ్డం సాంబశివరావు, డైరెక్టర్లు నెమ్మాది వేణుమాధవ్, గుద్దేటి సోమయ్య, కోఆర్డినేటర్లు జిల్లేపల్లి జాషువా, దేవరంగుల వీరస్వామి పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న సురేష్ దంపతులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి ఆలయ ఆవరణలో నిర్మించనున్న భోజనశాల నిర్మాణానికి మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన బండారు సురేష్ ధనలక్ష్మి దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం రూ.25వేలు నగదు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, గౌరవసలహాదారుడు పసుపులేటి భిక్షం పాల్గొన్నారు.

మాలమహానాడు మండల నూతన కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న శ్రీను

చిలుకూరు : మండలంలోని పోలేనిగూడెంలో మాల మహానాడు మండలం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇట్టిమళ్ల మధు, ఉపాధ్యక్షుడిగా తిరగమళ్ల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా మామిడి నరసింహారావు, వర్కింగ్ అధ్యక్షుడిగా గుండు మధుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ.. సంఘం సమస్యల పరిష్కారానికి, బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిడతల శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి జెట్టి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు పాలడుగు నాగరాజు, నాయకులు పిడితల శంకర్‌రావు, నాగరాజు, రాఘవేంద్ర, అంజి, వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

మఠంపల్లి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పత్తి సైదులు, ప్రధాన కార్యదర్శిగా షేక్ జహంగీర్, ఉపాధ్యక్షుడిగా షేక్ హుస్సేన్, కోశాధికారి మధు, సహాయ కార్యదర్శిగా వెంకన్న ఎన్నికయ్యారు.

సర్కారు బడులకు కొత్త సొబగులు

- 'మన ఊరు- మన బడి'కి 15 పాఠశాలలు ఎంపిక
- అంత్యాతండా, అల్లీపురంలో పనులు పూర్తి



అంత్యాతండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

మఠంపల్లి : రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన ఊరు- మన బడి పథకంతో ప్రభుత్వ బడులకు మహర్దశ పట్టింది. మండలంలోని 15 ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఈ పథకం ద్వారా ఈ ఏడాది ఎంపిక చేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో మరమ్మతులతో పాటు నూతన భవనాలు, మరుగుదొడ్లు తదితర నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ముందస్తుగా మోడల్ స్కూల్‌గా ఎంపిక చేసిన మండలంలోని అంత్యాతండా ఎంపీపీఎస్, అల్లీపురం ఎంపీపీఎస్ పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు రూ.17 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి పనులు పూర్తిచేసి ప్రారంభించారు.

అభివృద్ధి ఇలా..

ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.11 లక్షలతో పాఠశాలల్లో ప్రహరీ నిర్మాణం, బాలికల మరుగు దొడ్లు, కిచెన్ షెడ్లు పూర్తి చేశారు. మరో రూ. 6 లక్షలతో విద్యుదీకరణ, తాగు నీటి సరఫరా, మైనర్ రిపేర్లతో పాటు భవనాలకు రంగులు, తరగది గదుల్లో డెస్కులు, గ్రీన్ చాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాలలు సర్వాంగ సుందరంగా తయారయ్యాయి.

త్వరలో 13 పాఠశాలల్లో..

మండలంలోని మరో 13 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. వాటిలో భీల్యానాయక్‌తండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రఘునాథపాలెం జడ్పీహెచ్ఎస్, పెదవీడు జడ్పీహెచ్ఎస్, వరదాపురం జడ్పీహెచ్ఎస్, యూపీఎస్ బక్కమంతులగూడెం, ఎంపీపీఎస్‌లు కొత్తదొనబండతండా, గుర్రంబోడుతండా, మటంపల్లి, పెదవీడు, మఠంపల్లి ఎస్సీకాలనీ, రఘునాథపాలెం, చౌటపల్లి పాఠశాలలు ఎంపిక చేయబడ్డాయి. ఈ పాఠశాలల్లో త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.



అంత్యాతండా పాఠశాలలోని తరగతి గది

తరగతి గదులు బాగు చేశారు



పాఠశాలలో తరగతి గదులు, మరుగు దొడ్లను బాగు చేశారు. ఇప్పుడు గదులు చాలా బాగా ఉన్నాయి. క్లాస్‌రూంలో బోర్డులు, బెంచీలు, డెస్కులు కొత్తవి ఏర్పాటు చేశారు.

– ధారావత్ మమత, 5వ తరగతి, అంత్యాతండా

పాఠశాల అందంగా తయారైంది



అంత్యాతండా ప్రాథమిక పాఠశాలలో మన ఊరు - మనబడి నిధులతో చేపట్టిన పనులు పూర్తికావడంతో అందంగా తయారైంది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మౌలిక సదుపాయాలు సమకూరాయి.

– ఎస్‌కే మస్తాన్, హెచ్ఎం, అంత్యాతండా

త్వరలో అన్ని పాఠశాలల్లో..



మన ఊరు - మన బడికి ఎంపికైన 15 పాఠశాలల్లో రెండు పాఠశాలలను మోడల్‌గా ఎంపిక చేసి పనులు పూర్తిచేశాం. త్వరలోనే అన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతాం.

– పానుగోతు చత్రునాయక్, ఎంఈఓ మఠంపల్లి

వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



పూర్ణాహుతిలో పూజా ద్రవ్యాలు వేస్తున్న ఎంపీపీ, ఆలయ కమిటీ సభ్యులు

కోదాడఅర్బన్ : పట్టణంలోని భవానీనగర్‌లో గల వరసిద్ధి వినాయకస్వామి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి తెల్లవారుజాము నుంచే పంచామృతాభిషేకాలు, గణపతి పూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీగణపతి, నవగ్రహ హోమాలు, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను బ్రాహ్మణులు నిర్వహించారు. కాగా ఆలయ వార్షికోత్సవానికి ఎంపీపీ చింత కవితారాధారెడ్డి హాజరై ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతిలో ఎంపీపీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి అజంతాభాస్కర్‌తో కలిసి పూజా ద్రవ్యాలు హోమానికి సమర్పించారు. అనంతరం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కాగా స్వామి వారికి అరకిలో విలువ చేసే వెండి కిరీటాన్ని అక్కిరాజు ప్రసాద్ సమత దంపతులు బహూకరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రమీల, డాక్టర్ శ్రీపతిరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధులకు ఘన నివాళి



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : మండలంలోని జగన్నాథపురంలో నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారి స్థూపాల వద్ద సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు వెంపటి పెదవెంకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ సైదా మాట్లాడారు. భూమికోసం, భుక్తికోసం, పేద ప్రజల విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఆనాడు మునగాల పరగణాలో 33మంది అమరులయ్యారని అన్నారు. వారి పోరాట స్ఫూర్తితోనే మునగాల పరగణాలో ఆనాడు అనేక గ్రామాలలో పేదలకు భూములు పంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కార్యవర్గ సభ్యులు వీరబోయిన వెంకన్న, గ్రామ కార్యదర్శి వెంపటి బ్రహ్మం, భూతం వెంకన్న, వెంపటి వీరబాబు, మహిళా సంఘం నాయకురాలు షేక్ ఖాజాబీ, భూతం మోహన్ బాబు, కోడి వెంకన్న, వెంపటి బుచ్చయ్య, నీలారపు కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెరిక కుల నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

కోదాడఅర్బన్ : జిల్లా పెరిక సంఘం, ఖైరతాబాద్ పెరిక హాస్టల్ ఆధ్వర్యంలో పెరిక కుల నిరుద్యోగ యువతీ, యువకులకు అందిస్తున్న ఉచిత గ్రూప్స్, పోలీస్ ఉద్యోగాల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఖైరతాబాద్ పెరిక కులం హాస్టల్స్ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల నాగార్జున, పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు వనపర్తి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం భవన్‌లో నిరుద్యోగ యువతీ, యువకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. హైదారాబాద్‌లో ఐఏఎస్ ర్యాంకులు సాధించిన ముత్తినేని వీరయ్య సారథ్యంలో నడుస్తున్న శ్రీరామానుజన్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు అభ్యర్థులకు రూ.వేయి ఉపకార వేతనాన్ని కూడా అందిస్తున్నామన్నారు. విద్యావంతులైన పెరిక కుల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. సదస్సులో కోదాడ పెరిక హాస్టల్ అధ్యక్షుడు బోలిశెట్టి కృష్ణయ్య, పెరిక సంఘం నాయకులు జట్టుకొండ సత్యనారాయణ, రాంబాబు, రాజేష్, జయరామయ్య, వేణు, కృష్ణ, అనురాధ, అశోక్, శ్రీను, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారులకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : 50ఏళ్లు నిండిన మలిదశ ఉద్యమకారులకు నెలకు రూ.5వేల పింఛను ఇవ్వాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా రాజకీయ జేఏసీ ఏర్పడి వివిధ రంగాల్లో ఉద్యమకారులు ఉద్యమాన్ని ఉధృతం చేసి తెలంగాణ సాధనకు తమవంతుగా కృషి చేశారని అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు వయో భారంతో జీవనం కొనసాగించడం ఇబ్బందిగా ఉందన్నారు. వారందరినీ కాపాడాల్సిన బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను అర్పించిన ఉద్యమకారులతో పాటు జైలుకు వెళ్లిన ఉద్యమకారుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ పథకాల్లో 20శాతం ఉద్యమకారులకు కేటాయించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రావుల సత్యం, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అంబటి అంజి తదితరులున్నారు.

ఎంపీ ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్ : ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన డి.అచ్చయ్య ఆదివారం టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్ సమక్షంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ.. చెప్పుడు మాటలు విని అచ్చయ్య బీఆర్ఎస్‌లో చేరారని, తన తప్పు తెలుసుకుని తిరిగి కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా మంజూనాయక్, మాజీ ఎంపీపీ అప్పయ్య, లక్ష్మి, నాగుల్‌మీరా, పుల్లారెడ్డి, జాన్ మియా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ కవిత

కోదాడరూరల్ : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతుగా కృషి చేస్తానని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కూచిపూడిలో మండల పరిషత్ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. విడతల వారీగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను పూర్తి చేస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శెట్టి సురేష్, ఉపసర్పంచ్ హుస్సేన్‌బీ, వార్డు సభ్యులు వసంతలక్ష్మి, అబ్దుల్‌నబీ, వీరరాఘవయ్య, నర్సింహారావు, లింగారావు, వెంకట్, రామంజి, ఉపేందర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలిగా శ్రీలతారెడ్డి



శ్రీలతారెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

మునగాల : మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఎలక శ్రీలతారెడ్డి కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలిగా నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ జారీ చేసిన నియామకపత్రాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీలతారెడ్డి మాట్లాడుతూ.. మండలంలో పార్టీ అభివృద్ధికి, మహిళల హక్కుల సాధనకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మండల నాయకులు పాలపాటి ప్రవీణ్‌కుమార్, సుంకర పిచ్చయ్య, నాగేశ్వరరావు, గోదేశి నరేష్, హరిబాబు పాల్గొన్నారు.

బీజేపీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కోదాడరూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న అక్కిరాజు యశ్వంత్



హుజూర్‌నగర్ : స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి



కోదాడఅర్బన్ : కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న నరేష్

కోదాడరూరల్ : బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యురాలు నూనె సులోచన, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుడిబండలో నిర్వహించిన ప్రజాగోస-బీజేపీ భరోసా సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. వాటన్నింటిని ప్రజలకు వివరించాలని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ అధికారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో శక్తికేంద్రం ఇన్‌చార్జ్ యరగాని రాధాకృష్ణ, కనగాల నారాయణ, శ్రీనివాస్, గుర్వయ్య, చిట్టయ్య, సత్యనారాయణ, పుల్లారావు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

రైతుబంధు కాదు.. భూస్వాముల బంధు

హుజూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం ఇచ్చేది రైతు బంధు కాదు.. భూస్వాముల బంధు అని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గుండెబోయిన వీరబాబు ఆరోపించారు. ఆదివారం పట్టణంలో బీజేపీ శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి పథకంలో కేంద్ర ప్రభుత్వం వాటా ఉందన్నారు. ఎరువుల మీద రైతులకు సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చేది రైతుబంధు రైతుల కోసం కాదని అది భూస్వాముల కోసం ఇచ్చే భూస్వాముల బంధు అని పేర్కొన్నారు. రాష్ట్రంలో అవినీతి, కుటుంబ పాలన నడుస్తోందని, నియోజకవర్గంలో భూకబ్జాలు, ఇసుక మాఫియా, రేషన్ బియ్యం దందా నడుపుతున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.చంద్రారెడ్డి, డి.రామరాజు, డి.శశికళ, పి.ప్రతాప్‌రెడ్డి, ఐ.రవి, ఎం.వెంకటేశ్వర్లు, వేంకటేశ్వరరాజు, సమీరా, శ్రీనివాస్, బ్రహ్మచారి, వెంకటేశ్వర్లు, కొండలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పుల భారం మోపుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

కోదాడఅర్బన్ : తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్కో వ్యక్తిపై రూ.2లక్షల50వేల అప్పుచేసి ప్రజలపై భారం మోపుతుందని, మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేసిన కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ఓటు వేసి బీజేపీని గెలిపించాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అంబల నరేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 35వ వార్డులో శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్ ఆ వార్డు ఇన్‌చార్జ్ పోలా సురేష్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ పాలనతో రాష్ట్ర ప్రజలకు తీరని నష్టం కలిగిందన్నారు. సమావేశంలో బూత్ కమిటీ అధ్యక్షుడు కొత్తా రామారావు, పట్టణ అధ్యక్షుడు నకిరికంటి జగన్‌మోహన్‌రావు, నల్లగొండ పార్లమెంట్ కో కన్వీనర్ యాద రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాతులూరి హనుమంతరావు, ఒరుగంటి పురుషోత్తం, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు కొటకొమ్ముల భాగ్యమ్మ, శంకర్‌రావు, కల్యాణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే వేతనాల పెంపు



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాలు

కోదాడఅర్బన్ : సీఐటీయూ ఆధ్వర్యంలో చేసిన పోరాట ఫలితంగానే తెలంగాణ ప్రభుత్వం మధ్యాహ్న భోజన వర్కర్లకు వేతనాలను పెంచిందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలు అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ భవనంలో నిర్వహించిన మధ్యాహ్న వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 20సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది మధ్యాహ్న భోజన కార్మికులు అతి తక్కువ వేతనంతో పిల్లలకు భోజనం వడ్డిస్తున్నారని, ఈ తరుణంలో కార్మికులను ఐక్యంచేసి అనేక ఉద్యమాలు చేసిన ఫలితంగా తెలంగాణ ప్రభుత్వం కార్మికులకు రూ.3వేల వేతనం ఇస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో కార్మికుల సంఘం పట్టణ అధ్యక్షురాలు గురజాల తిరుపతమ్మ, కార్యదర్శి సుంకర అన్నపూర్ణమ్మ, రామనుజమ్మ, కుమారి, పుష్ప, సావిత్రి, బుజ్జి, వెంకటరమణ, సుజాత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు శానిటరీ నాప్‌కిన్స్ అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చీకూరి లీలావతి

హుజూర్‌నగర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు శానిటరీ నాప్‌కిన్స్ ఉచితంగా అందించాలని విన్నపం ఒక పోరాటం రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి కోరారు. ఆదివారం పట్టణంలోని టౌన్ హాల్లో స్వచ్ఛంద, మహిళా సంస్థల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళల ఆరోగ్య పోరాటానికి ప్రతిఒక్కరూ చెయ్యిచెయ్యి కలపాలని కోరారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పబ్బతి స్రవంతి, తమ్మన సుజాత, అంకతి అప్పయ్య, దగ్గుపాటి బాబురావు, సాయి, శివ, సైదులు, నరసింహారావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, విజయ, మధు, కాశయ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండుగ

పాలకవీడు : మండలంలోని కల్మేట్‌తండాలో ముత్యాలమ్మ పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో మహిళలు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నైవేద్యాలు సమర్పించారు. అనంతనం ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఓజో ఫౌండేషన్ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న గ్రామస్తులు వెంకటి, శివారెడ్డి ఓజో ఫౌండేషన్ సభ్యులు గంగరాజ్, రమేష్, సుధాకర్, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మోతె : మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన మేకరబోయిన ఉదయ్‌కుమార్ ఆదివారం సూర్యాపేట నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తలకు బలమైన గాయాలమై తలలో బ్లడ్‌క్లాట్ అయ్యింది. దీంతో ఉదయ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. గ్రామస్తులు నిరుపేద విద్యార్థిని ఆదుకోండి అనే వాట్సాప్ సందేశంతో నకిరేకల్ పట్టణానికి చెందిన లిటిల్ సోల్జర్ ఫౌండేషన్ చైర్మన్ బ్రహ్మదేవర నరేష్, బాసు నాగరాజు స్పందించి గ్రామానికి వెళ్లి ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఇసుక లారీల పట్టివేత

కోదాడరూరల్ : అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను ఆదివారం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా మండలంలోని కాపుగల్లు మీదగా కోదాడకు ఇసుక లారీలు వస్తున్నాయనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి రెండు లారీలను పట్టుకున్నట్లు ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు. లారీలను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం


మోతె : మండలంలోని కొత్తగూడెం గ్రామంలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆదివారం వార్షిక కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. కల్యాణంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

కోదాడరూరల్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జనగామ జిల్లా పాలకుర్తి నుంచి ప్రారంభమైన పాదయాత్రకు కోదాడ మండల కార్మికులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ముత్తయ్య, కరీం, సురేందర్, రామకృష్ణ, లింగయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్, లలిత ఉన్నారు.

నడిగూడెం : గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పాలకుర్తి సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాగరాజు, వెంకన్న, పాష, హుస్సేన్, శ్రీకాంత్, వెంకన్న, నాగభూషణం, అంజయ్య పాల్గొన్నారు.

కోలాట పోటీల్లో ప్రథమ బహుమతి



చిన్నారులకు బహుమతి, ప్రశంస పత్రం అందజేస్తున్న నిర్వాహకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన శ్రీ రామాంజనేయ ఆసరా స్వచ్ఛంద సంస్థ నాట్యమండలి జూనియర్ కళాకారులు చిలుకూరు మండలంలోని బేతవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి డీజే కోలాటం పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి రూ.13వేల116 నగదు గెలుపొందినట్లు సర్పంచ్ షేక్ సలీమారంజాన్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులను ఆమె అభినందించారు. అనంతరం ఆ సంస్థ చైర్మన్ చిమట సైదులును సన్మానించారు. కార్యక్రమంలో మాడుగుల మల్లయ్య, చీకూరి లీలావతి, బాబురావు, సుజాత, నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.